Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక
మీ ప్రాంతంలో జరుగుతున్న అవినీతిని బయటపెట్టాలని ఉందా..
నిజాన్ని నిర్భయంగా చెప్పాలని ఉందా..
సంచలన కథనాలకు కేరాఫ్‌గా నిలిచిన ఇది కద నిజం
విలేఖరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా దూసుకెళ్తున్న
ఇది కద నిజం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల
వారిగా విలేఖరులు కావలెను..
6300490170-9848983329
www.edikadanijam.com
Edikadanijam@gmail.com
No Monthly Targets
* terms and conditions apply

Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక

ఇది కద నిజం
మీ ప్రాంతంలో జరుగుతున్న అవినీతిని బయటపెట్టాలని ఉందా..
నిజాన్ని నిర్భయంగా చెప్పాలని ఉందా..
సంచలన కథనాలకు కేరాఫ్‌గా నిలిచిన ఇది కద నిజం
విలేఖరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా దూసుకెళ్తున్న
ఇది కద నిజం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల
వారిగా విలేఖరులు కావలెను..
6300490170-9848983329
www.edikadanijam.com
Edikadanijam@gmail.com
No Monthly Targets
* terms and conditions apply

గురువారం 12-03-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :1 | సంచిక : 273 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

## ‘తెలంగాణను కించపరచలేదు’

- టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు క్లారిటీ


2 లో

## తెలంగాణ నూతన గవర్నర్‌గా శివప్రతాప్ ప్రమాణం


2 లో

## థాయ్‌లాండ్‌లో 4 రోజుల పనిదినాలే..



2 లో

## భూమిపైకి దూసుకొస్తున్న నాసా ఉపగ్రహం


2 లో

## కాంగ్రెస్‌ను బంగాళాఖాతంలో విసిరేస్తే తప్ప..

తెలంగాణను రక్షించలేం: బండి సంజయ్



2 లో

## మొజ్తాబా ఖమేనీ క్షేమంగా ఉన్నారు

-యూసెఫ్ పెజెస్కియాన్


2 లో

## మే వరకు అత్యధిక ఉష్ణోగ్రతలు.. ఎల్ నినోపై ఐఎండీ వార్నింగ్


2 లో

## బ్యాలెట్‌కు చెక్.. స్థానిక పోరుకు ఈవీఎం కసరత్తు



2 లో

న్యూస్ డెస్క్, 11 మార్చి (ఇది కద నిజం): రాష్ట్రంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను ఈవీఎంల ద్వారా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆలోచిస్తున్నది. తొలిసారిగా ఎలక్ట్రానిక్ యంత్రాల ద్వారా గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికలు జరిపేందుకు ఎస్ఈసీ కసరత్తు చేస్తున్నది. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను వేగవంతం చేసింది.

ఒక యంత్రం.. రెండు ఓట్లు

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో ఒకేసారి ఓటు వేసే విధంగా ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్) కొత్త తరహా కంట్రోల్ యూనిట్లను తయారు చేసింది. వీటిని ఇప్పటికే కేరళ, మధ్యప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయవంతంగా ఉపయోగించింది. ఈ విధానంపై ఎలాంటి విమర్శలు రాకపోగా.. పార్టీలు సైతం అంగీకరించాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కూడా ఈ తరహాలోనే ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో ఒకేసారి రెండు ఓట్లు వేయాల్సి ఉంటుంది. అయితే.. ఒక్కో ఎన్నికకు ఒక కంట్రోల్ యూనిట్ అవసరమయ్యేది. అంత పెద్ద సంఖ్యలో ఎస్ఈసీ వద్ద ఈవీఎంలు అందుబాటులో లేవు. దీంతో బ్యాలెట్ పేపర్, బాక్సు విధానాన్నే అనుసరించారు. కానీ ఈసీఐఎల్ కొత్త తరహా టెక్నాలజీతో ఒకటే కంట్రోల్ యూనిట్‌కు రెండు బ్యాలెట్ యూనిట్లను అటాచ్ చేయవచ్చు. కంట్రోల్ యూనిట్‌లో డిటాచెబుల్ మెమొరీ మాడ్యూల్‌ను ఉంచుతారు. దీనిని పోలింగ్ పూర్తయ్యాక భద్రపరిచి.. ఎన్నికల కౌంటింగ్ సమయంలో మళ్లీ తీసుకువచ్చి ఓట్లను లెక్కిస్తారు. ఆ విధంగా ఈసీఐఎల్ సాఫ్ట్‌వేర్ రూపొందించింది.

చెల్లని ఓట్లకు పరిష్కారం

రాష్ట్రంలో ఇలాంటి ఈవీఎంలు 17 వేల వరకు అందుబాటులో ఉన్నాయి. గతంలోనే వీటిని రాష్ట్ర అవసరాల కోసం తయారు చేసినా.. ఇప్పటివరకు వినియోగించలేదు. వీటిని వినియోగించడం ద్వారా పెద్దఎత్తున బ్యాలెట్ పేపర్ ప్రింటింగ్ భారం తగ్గుతుంది.

## హోర్ముజ్ జలసంధి మూసివేతతో ప్రపంచానికి ముప్పు

# ఐక్యరాజ్యసమితి హెచ్చరిక!



2 లో

న్యూస్ డెస్క్, 11 మార్చి (ఇది కద నిజం): పశ్చిమ ఆసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో హోర్ముజ్ జలసంధి ఎక్కువకాలం పాటు మూతపడితే ప్రపంచ వాణిజ్యం, అభివృద్ధి తీవ్రంగా దెబ్బతింటాయని ఐక్యరాజ్యసమితి హెచ్చరించింది. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా ఆహార ధరలు పెరగడమే కాకుండా జీవన వ్యయం భారమవుతుందని ఐక్యరాజ్యసమితి వాణిజ్య, అభివృద్ధి సంస్థ (యూఎన్సిటీఏడి) మంగళవారం విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడులు, ప్రతిగా ఇరాన్ ప్రతీకార చర్యల వల్ల హోర్ముజ్ జలసంధి ద్వారా జరగాల్సిన రవాణాకు తీవ్ర అంతరాయం కలిగింది. ఫిబ్రవరి 28న దాడులు మొదలైనప్పటి నుండి ఈ మార్గంలో ఓడల రాకపోకలు 97 శాతం పడిపోయాయి. ప్రపంచవ్యాప్తంగా సముద్ర మార్గం ద్వారా జరిగే చమురు రవాణాలో నాలుగో వంతు (25%) ఈ జలసంధి ద్వారానే జరుగుతుంది. 2024 గణాంకాల ప్రకారం.. రోజుకు సుమారు 20 మిలియన్ బ్యారెళ్ల చమురు ఈ మార్గం గుండా వెళుంది. చమురు సరఫరా దాదాపు పడిపోవడంతో దాని ఎఫెక్ట్ గ్యాస్ సిలిండర్లపై పడింది. గ్యాస్ ధరలు, ఎరువుల ధరలు, చమురు ధరలు పెరిగితే ఆహార ధరలు పెరుగుతాయని యూఎన్సిటీఏడి వివరించింది. ముఖ్యంగా పేద దేశాలపై ఈ ప్రభావం తీవ్రంగా ఉంటుంది. ఈ మార్గం ద్వారా రవాణా అయ్యే చమురులో 84 శాతం ఎల్ఎన్‌జీ గ్యాస్‌లో 83 శాతం ఆసియా దేశాలకే వెళ్తుంది.

# ఇరాన్ కొత్త అధినేతకు ఉత్తర కొరియా మద్దతు


2 లో

న్యూస్ డెస్క్, 11 మార్చి (ఇది కద నిజం): ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ మరణం తర్వాత ఆయన కుమారుడు మొజ్తబా ఖమేనీ బాధ్యతలు చేపట్టిన విషయం అందరికీ తెలిసిందే. అయితే ఖమేనీ వారసత్వాన్ని మొజ్తబా అందిపుచ్చుకోవడాన్ని ఉత్తర కొరియా అధికారికంగా సమర్థించింది. ఇరాన్ ప్రజల నిర్ణయాన్ని తాము గౌరవిస్తామని ప్రకటిస్తూనే.. అమెరికా, ఇజ్రాయెల్ దేశాలపై ప్యాంగ్యాంగ్ నిప్పులు చెరిగింది. పశ్చిమాసియాలో శాంతిని తుడిచి పెట్టేందుకు వాషింగ్టన్ ప్రయత్నిస్తోందని ఉత్తర కొరియా విదేశాంగ శాఖ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తింది.


ఇరాన్ పాలకులను మార్చాలని, అక్కడ తమకు అనుకూలమైన వ్యవస్థను తీసుకు రావాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలను ఉత్తర కొరియా తప్పుబట్టింది. ఒక దేశ రాజకీయ వ్యవస్థలో జోక్యం చేసుకోవడం, ఆ దేశ ప్రాంతీయ సమగ్రతను దెబ్బతీయడం అరాచకమని ఉత్తర కొరియా విదేశాంగ ప్రతినిధి పేర్కొన్నారు. ఇరాన్ సామాజిక వ్యవస్థను కూలదోసేందుకు అమెరికా-ఇజ్రాయెల్ కూటమి పన్నుతున్న కుట్రలను ప్రపంచం తిరస్కరించాలని పిలుపునిచ్చారు. ఇలాగే చైనా, రష్యాలు సైతం ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌గా ఎన్నికైన మొజ్తబాకు మద్దతు ఇచ్చాయి. రెండ్రోజుల క్రితమే ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించాయి.

అమెరికా-దక్షిణ కొరియా విన్యాసాలపై ఆగ్రహం

మరోవైపు అమెరికా, దక్షిణ కొరియా సంయుక్తంగా నిర్వహిస్తున్న ‘ఫ్రీడమ్ షీల్డ్’ సైనిక విన్యాసాలను ఉత్తర కొరియా తీవ్రంగా పరిగణిస్తోంది. ఇరాన్ యుద్ధం నేపథ్యంలో ఈ విన్యాసాలు కేవలం రక్షణ కోసం చేస్తున్నవి కావని, ఇవి తమపై దాడి చేసేందుకు జరుగుతున్న ముందస్తు సన్నాహాలేనని కిమ్ ఆరోపిస్తున్నారు.

## కడియం, దానంలకు బిగ్ రిలీఫ్

- స్పీకర్ కీలక నిర్ణయం
- అనర్హత పిటిషన్లు కొట్టివేత
- సుప్రీంకోర్టు గడువు నేపథ్యంలో నిర్ణయం
- ఇప్పటికే 8 మందికి క్లీన్ చిట్
- మొత్తం 10 మంది ఎమ్మెల్యేలకు రిలీఫ్
- తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్


2 లో

# నక్షా లేని 373 గ్రామాల్లో రీ-సర్వేకు సిద్ధం

- భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు
- భూముల సర్వే కోసం ఆధునిక రోవర్ల కొనుగోలు ప్రతిపాదన
- ఇప్పటికే 460 రోవర్లు కొనుగోలు చేసిన రెవెన్యూ శాఖ
- అన్ని గ్రామ పంచాయతీలకు శాశ్వత భవనాల నిర్మాణం లక్ష్యం
- ఎమ్మార్వో, ఎంపీడీవో కార్యాలయాలను కలిపి నిర్మించే ప్రణాళిక
- అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం, నాణ్యమైన విద్యపై దృష్టి
- యాచక వృత్తిలో ఉన్న చిన్నారులను శిశు విహార్‌కు తరలింపు
- అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో ఉపాధి కల్పించే కోర్సులు


మిగతాది 2 లో

న్యూస్ డెస్క్, 11 మార్చి (ఇది కద నిజం)

తెలంగాణలో నక్షా మ్యాప్ లేని 373 గ్రామాలు గుర్తించామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు త్వరలోనే ఆయా గ్రామాల్లో రీ-సర్వే చేపట్టబోతున్నామన్నారు. భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్, సర్వే విభాగాలను ఒకే గొడుగు కిందకు తీసుకురానున్నట్లు చెప్పారు. అందుకు ప్రత్యేక పోర్టల్‌ను రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. ఉపాధి-శిక్షణ, పంచాయతీరాజ్, పర్యాటక, రెవెన్యూ, గృహనిర్మాణ శాఖలు పంపిన బడ్జెట్ ప్రతిపాదనలపై మంగళవారం సెక్రటేరియట్‌లో ఆర్థిక మంత్రి, డిప్యూటీ సీఎం భట్టి సమీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టితో భేటీ అయిన పొంగులేటి భూముల రీ-సర్వే కోసం అత్యాధునిక రోవర్ల కొనుగోలుకు 2026-27 బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరారు. భూముల సర్వేకు ప్రస్తుతం మండలానికొకటి చొప్పున 460 రోవర్లను కొనుగోలు చేశామని చెప్పారు. మరో 400 రోవర్ల కొనుగోలుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని వెల్లడించారు.

ఇక తెలంగాణలోని అన్ని గ్రామ పంచాయతీలకు రానున్న మూడేళ్లలో శాశ్వత భవనాలు నిర్మించేందుకు సర్కార్ సిద్ధంగా ఉందని భట్టి విక్రమార్క వెల్లడించారు. పంచాయతీరాజ్‌శాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తే.. నిధులు కేటాయిస్తామన్నారు. స్థలాలు అందుబాటులో ఉన్నచోట ఎమ్మార్వో, ఎంపీడీవో కార్యాలయాలను కలిపి నిర్మించే అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.

## కర్ణాటక వ్యాప్తంగా బంద్


- ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లపై నిరసన
- సరిహద్దుల్లో వాహనాల నిలిపివేత
- టైరోడ్ సర్కిల్ వద్ద పోలీస్ బందోబస్తు
- తెలంగాణ-కర్ణాటక రాకపోకలు నిలిచిపోవు
- ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు
- వైద్య, విద్య అవసరాలకు ఆటంకం



2 లో

## ఏపీ ప్రజలకు శుభవార్త

- ఉగాది కానుకలుగా అన్నదాత సుఖీభవ, గృహ ప్రవేశాలు!
- కలెక్టర్ల సదస్సు ప్రారంభం
- సీఎం చంద్రబాబు కీలక సూచనలు
- సుపరిపాలనపై దృష్టి పెట్టాలి
- సూపర్ సిక్స్ పథకాల అమలు
- విద్యుత్ చార్జీల తగ్గింపుపై నిర్ణయం


2 లో

Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం

గురువారం 12-03-2026

## కడియం శ్రీహరి, దానం నాగేందర్‌లకు బిగ్ రిలీఫ్

న్యూస్ డెస్క్, 11 మార్చి (ఇది కద నిజం): తెలంగాణ రాజకీయాల్లో ఉత్కంఠ రేపిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, దానం నాగేందర్ లపై దాఖలైన అనర్హత పిటిషన్లను ఆయన కొట్టివేశారు. దీంతో ఇద్దరు ఎమ్మెల్యేలకు బిగ్ రిలీఫ్ లభించినట్లైంది. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం.. మార్చి 12వ తేదీలోగా స్పీకర్ అనర్హత పిటిషన్లపై విచారణ చేసి.. తుది నిర్ణయాన్ని ప్రకటించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో గతంలో ఎనిమిది మందికి క్లీన్ చిట్ ఇచ్చిన స్పీకర్.. తాజాగా మరో ఇద్దరికీ క్లీన్ చిట్ డిక్లేర్ చేశారు. దీంతో 10 మంది ఎమ్మెల్యేలకు ఊరట లభించింది. తెలంగాణ రాజకీయాల్లో గత కొంతకాలంగా ఉత్కంఠ రేపుతున్న ఎమ్మెల్యేల అనర్హత అంశంపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీసుకున్న నిర్ణయం ఇప్పుడు హాట్ టాపిక్ అయింది. బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచిన పదిమంది ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు, పోచారం శ్రీనివాస్ రెడ్డి, పరిగి శ్రీనివాస్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ఎం. సంజయ్ కుమార్, గూడెం మహిపాల్ రెడ్డి, టి. ప్రకాశ్ గౌడ్, కాలెయాదయ్య, అరికెపూడి గాంధీ కాంగ్రెస్ పార్టీలో చేరారంటూ బీఆర్ఎస్ నేతలు స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. స్పీకర్ నిర్ణయం తీసుకోవడంలో ఆలస్యం చేస్తున్నారని హైకోర్టు, ఆ తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ తర్వాత సుప్రీంకోర్టు నిర్ణీత గడువులోగా స్పీకర్ విచారణ చేసి తుది నిర్ణయాన్ని వెల్లడించాలని ఆదేశాలు జారీ చేసింది.

## హోర్ముజ్ జలసంధి మూసివేతతో ప్రపంచానికి ముప్పు: ఐక్యరాజ్యసమితి హెచ్చరిక!

మొదటి పేజీ తరువాయి

జలసంధి మూసివేత వల్ల ఆసియాలో ఇంధన సంక్షోభం ఏర్పడే అవకాశం ఉందని ఐక్యరాజ్యసమితి హెచ్చరించింది.

ఆర్థిక సంక్షోభం పొంచి ఉందా?

అంతర్జాతీయ చట్టాలకు లోబడి సముద్ర మార్గాల్లో రవాణా భద్రతను కాపాడాలని, ఉద్రిక్తతలను తగ్గించాలని ఐరాస సెక్రటరీ జనరల్ ప్రతినిధి స్టీఫన్ దుజారిక్ కోరారు. ఇప్పటికే అప్పుల భారంతో ఉన్న అభివృద్ధి చెందుతున్న దేశాలకు, పెరిగిన ఇంధన, రవాణా ఖర్చులు కోలుకోలేని దెబ్బ తీస్తాయని నివేదిక స్పష్టం చేసింది.

## బ్యాలెట్‌కు చెక్.. స్థానిక పోరుకు ఈవీఎం కసరత్తు

మొదటి పేజీ తరువాయి

ఓట్ల లెక్కింపు సైతం వేగంగా, పారదర్శకంగా పూర్తవుతుందని భావిస్తున్నారు. అంతేకాకుండా కొన్ని చోట్ల చెల్లని ఓట్లతోనే గెలుపోటములు తారుమారవుతుంటాయి. కానీ.. ఈవీఎంలతో అలాంటి వాటికి ఆస్కారం లేదు. వీటన్నింటి నేపథ్యంలో ఈవీఎంలే మెరుగు అని ఎన్నికల సంఘం అధికారులు ఒక అంచనాకు వచ్చినట్లు తెలిసింది.

కేరళ మోడల్ అధ్యయనానికి బృందం: ఈ తరహా విధానాన్ని కేరళలో ఏ విధంగా అమలు చేశారనే దానిపై ఇప్పటికే అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు, కొందరు జిల్లాస్థాయి ఆఫీసర్లు అక్కడికి వెళ్లాలని నిర్ణయించినట్లు తెలిసింది. రాష్ట్రంలో 5,700పైగా వరకు ఎంపీటీసీ, 570 వరకు జెడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. వీటన్నింటిని కలిసి ఇప్పుడు అందుబాటులో ఉన్న ఈవీఎంలు సరిపోతాయని అంచనా వేస్తున్నారు. ఒకవేళ సరిపోకుంటే ఇతర రాష్ట్రాల నుంచి తెప్పించుకొని పూర్తిస్థాయిలో ఈవీఎంలతో ఎన్నికలు నిర్వహించాలని భావిస్తున్నట్లు తెలిసింది.

## 'తెలంగాణను కించపరచలేదు'

### - టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు క్లారిటీ

న్యూస్ డెస్క్, 11 మార్చి (ఇది కద నిజం): పార్లమెంట్‌లో టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు చేసిన వ్యాఖ్యలు వివాదస్పదంగా మారాయి. తాజాగా జరిగిన లోక్‌సభ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంపై ఆయన మాట్లాడుతూ.. ఫిబ్రవరి 14, 2014 ను బ్లాక్ డేగా అభివర్ణించారు. దీనిపై బీఆర్ఎస్ నేతలు తీవ్రంగా స్పందించారు. ఏపీ ఎంపీలు తెలంగాణపై ఏడుపు ఆపాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ హెచ్చరించారు. పార్లమెంటులో ఏపీ ఎంపీల వ్యాఖ్యలపై 'ఎక్స్' వేదికగా ఆయన స్పందించారు. రాష్ట్రం విడిపోయి పన్నెండేండ్లు గడుస్తున్నా తెలంగాణపై విషం చిమ్మడం ఏమిటని ప్రశ్నించారు. లోక్‌సభ వేదికగా తెలంగాణ అస్తిత్వాన్ని కించపరిచేలా ఎంపీ లావు కృష్ణదేవరాయలు మాట్లాడారని మండిపడ్డారు. ఏపీ అభివృద్ధికి ఏం కావాలో అడిగే తెలివి లేక, తెలంగాణపై పడి ఏడవడం పరిపాటిగా మారిందని ఆయన పేర్కొన్నారు. అనవసరంగా మా జోలికి వచ్చి తెలంగాణ ప్రజలను అవమానిస్తే, కించ పరిచే విధంగా రాష్ట్ర ఏర్పాటుపై వాగితే మాత్రం తెలంగాణ సమాజం తగిన గుణపాఠం చెబుతుందని హెచ్చరించారు. ఈ వివాదంపై టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు స్పందించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. నేను తెలంగాణను వ్యతిరేకించలేదని, తెలంగాణను కించపరిచేలా మాట్లాడలేదు.. అని ఆయన స్పష్టం చేశారు. బిల్లు ఆమోదం సమయంలో స్పీకర్ తీరుపై మాత్రమే మాట్లాడాను.. అప్పటి స్పీకర్ మీరా కుమార్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని మాత్రమే ప్రస్తావించినట్లు వివరణ ఇచ్చారు. బీఆర్ఎస్ నేతలు సెంటిమెంట్‌ను రాజేయొద్దని రిక్వెస్ట్ చేశారు.

## తెలంగాణ నూతన గవర్నర్‌గా శివప్రతాప్ ప్రమాణం

న్యూస్ డెస్క్, 11 మార్చి (ఇది కద నిజం): తెలంగాణ నూతన గవర్నర్ గా శివప్రతాప్ శుక్లా ప్రమాణ స్వీకారం చేశారు. లోక్ భవన్ లో జరిగిన ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, సీఎస్ రామకృష్ణారావు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్, వివిధ శాఖల అధికారులు తదితరులు హాజరయ్యారు. ప్రమాణ స్వీకారానికి ముందు వందేమాతం, జనగణమన ఆలపించారు. అనంతరం శివప్రతాప్ శుక్లాతో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అపరేష్ కుమార్ సింగ్ ప్రమాణం చేయించారు. శివప్రతాప్.. తెలంగాణ గవర్నర్ గా తన బాధ్యతలను శ్రద్ధతో నిర్వహిస్తానని తెలుగులో ప్రమాణం చేశారు. ప్రమాణ స్వీకారం అనంతరం సీఎం రేవంత్ రెడ్డి ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటి వరకూ రాష్ట్రానికి గవర్నర్ గా ఉన్న జిష్ణుదేవ్ వర్మ ఉండగా.. ఆయన్ను రాష్ట్రపతి మహారాష్ట్ర గవర్నర్ గా బదిలీ చేసిన విషయం తెలిసిందే.

# కర్ణాటక వ్యాప్తంగా బంద్

న్యూస్ డెస్క్, 11 మార్చి (ఇది కద నిజం): కర్ణాటకలో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు అమలు జరగడంలేదని ఆరోపిస్తూ కర్ణాటక దళిత కుల సంఘాల ఆధ్వర్యంలో బుధవారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు రాష్ట్రవ్యాప్తంగా బంద్‌కు పిలుపునిచ్చారు. దీంతో తెలంగాణ నుంచి కర్ణాటకలోని రాయచూరు జిల్లాకు వెళ్లే వాహనాలను మన రాష్ట్ర సరిహద్దులోని టైరోడ్ సర్కిల్ వద్ద పోలీసులు నిలిపివేశారు. రోడ్డుకు అడ్డంగా బ్యారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాలను కర్ణాటకలోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కర్ణాటక రాయచూరు జిల్లా శక్తినగర్ ఎస్సై నారాయణ మాట్లాడుతూ కర్ణాటకలో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో అన్ని రంగాల్లో రిజర్వేషన్లు సక్రమంగా కొనసాగడం లేదని తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా డీఎస్ఎస్, జై భీమ్, ఎమ్మార్పీఎస్ కుల సంఘాల ఆధ్వర్యంలో బుధవారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు కర్ణాటకలో బంద్‌కు పిలుపునిచ్చినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా కర్ణాటక సరిహద్దులోని రాయచూరు జిల్లా శక్తినగర్ ఎస్సై నారాయణ తన సిబ్బందితో పాటు తెలంగాణలోని మక్తల్ సర్కిల్ సీఐ రామ్‌లాల్, మక్తల్ ఎస్సై భాగ్యలక్ష్మి, ఎస్సై రెడ్డి కృష్ణ, ఎస్సై నవీద్, మాగనూరు ఎస్సై రేవతి పోలీసులతో సమన్వయం చేసుకుని రాష్ట్ర సరిహద్దులోని టైరోడ్ సర్కిల్ వద్ద వాహనాలు కర్ణాటకలోకి వెళ్లకుండా చర్యలు చేపట్టారు. దీంతో తెలంగాణ నుంచి వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సులు, కార్లు, గూడ్స్ వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా తెలంగాణ నుంచి వైద్య, విద్య, వ్యాపార అవసరాల కోసం ప్రతిరోజూ కర్ణాటకకు వెళ్లే వారికి తీవ్ర అసౌకర్యం కలుగుతోంది.

## థాయ్‌లాండ్‌లో 4 రోజుల పనిదినాలే..

న్యూస్ డెస్క్, 11 మార్చి (ఇది కద నిజం): పశ్చిమాసియాలో ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం, హోర్ముజ్ జలసంధిలో తలెత్తిన సంక్షోభం ఆగ్నేయాసియా దేశాలను వణికిస్తోంది. తీవ్ర ఇంధన కొరత, ఆకాశాన్నంటుతున్న ధరల నేపథ్యంలో థాయ్‌లాండ్, వియత్నాం ప్రభుత్వాలు సంచలన నిర్ణయాలు తీసుకున్నాయి. ఇంధన వినియోగాన్ని తగ్గించుకునేందుకు ప్రభుత్వ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ ఆదేశాలు జారీ చేయడంతో పాటు పలు కీలక చర్యలకు శ్రీకారం చుట్టాయి. ఇంధనం కోసం పశ్చిమాసియా దేశాలపై ఎక్కువగా ఆధారపడే వియత్నాం ప్రస్తుతం గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోంది. ఫిబ్రవరి చివరి నుండి అక్కడ పెట్రోల్ ధరలు 32%, డీజిల్ 56%, కిరోసిన్ ఏకంగా 80% పెరిగాయి. అనవసర ప్రయాణాలను తగ్గించి, ఇంధనాన్ని ఆదా చేసేందుకు వీలైనంత వరకు ఉద్యోగులకు 'వర్క్ ఫ్రమ్ హోమ్' అవకాశం ఇవ్వాలని పారిశ్రామిక, వాణిజ్య మంత్రిత్వ శాఖ స్థానిక సంస్థలను కోరింది. ఇంధన నిల్వలను భద్రపరిచేలా సహకరించాలని వియత్నాం ప్రధాని ఫామ్ మిన్ మిన్.. కువైట్, ఖతార్, యూఏఈ దేశాధినేతలతో ఫోన్ ద్వారా చర్చలు జరిపారు.

థాయ్‌లాండ్‌లో 4 రోజుల పనిదినాలే!

ఇంధన సంక్షోభం నుంచి గట్టెక్కేందుకు థాయ్‌లాండ్ ప్రభుత్వం 'ఎమర్జెన్సీ' తరహా చర్యలు చేపట్టింది. ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంధన వినియోగాన్ని తగ్గించేందుకు వారానికి కేవలం నాలుగు రోజులు మాత్రమే పనిదినాలను అమలు చేయాలని నిర్ణయించింది. అత్యవసర సేవలు మినహా మిగిలిన అన్ని ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగులు పూర్తిగా ఇంటి నుండే పని చేయాలని ఆదేశించింది. రెండు దేశాల ప్రభుత్వాలు తమ పౌరులకు, అధికారులకు పలు కీలక సూచనలు చేశాయి. సొంత వాహనాల వాడకాన్ని తగ్గించి, బస్సులు, రైళ్ల వంటి ప్రజా రవాణాను వినియోగించాలని కోరాయి. దగ్గరి ప్రయాణాలకు సైకిళ్లను వాడాలని, కార్యాలయాలకు వెళ్లే వారు కార్‌పూలింగ్ (వాహన భాగస్వామ్యం) పద్ధతిని అనుసరించాలని సూచించాయి. అధికారులు తమ విదేశీ ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని లేదా నివారించాలని స్పష్టం చేశాయి. ప్రస్తుతం వియత్నాం రాజధాని హనోయి వంటి నగరాల్లో పెట్రోల్ బంకుల వద్ద వాహనదారులు బారులు తీరుతున్నారు. అంతర్జాతీయ పరిస్థితులు చక్కబడే వరకు ఈ పొదుపు చర్యలు పాటించక తప్పదని ఇరు దేశాల ప్రతినిధులు పేర్కొంటున్నారు.

# ఏపీ ప్రజలకు శుభవార్త..

న్యూస్ డెస్క్, 11 మార్చి (ఇది కద నిజం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన 6వ జిల్లా కలెక్టర్ల సదస్సు ప్రారంభమైంది. ఈ సమావేశానికి రాష్ట్ర మంత్రులు, వివిధ శాఖల ప్రధాన కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లు హాజరయ్యారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ సమావేశంలో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పరిపాలన సహా పలు కీలక అంశాలపై సమగ్రంగా చర్చించనున్నారు. సమావేశాన్ని ప్రారంభిస్తూ సీఎం చంద్రబాబు మాట్లాడారు.

'కలెక్టర్ల కాన్ఫరెన్స్ ద్వారా అన్ని ముఖ్యమైన విషయాలపై స్పష్టత ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇది ఆరో కలెక్టర్ల సమావేశం. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండింటిపై సమాన దృష్టి పెట్టుతూ ప్రజలకు గుడ్ గవర్నెన్స్ అందించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ నిర్ణయాలు దీర్ఘకాలిక ఫలితాలను ఇస్తాయి, అవి పాజిటివ్ లేదా నెగెటివ్‌గా ఉండవచ్చు. రాష్ట్ర పరిపాలనను మెరుగుపరచేందుకు ప్రభుత్వం రూపొందించిన 10 ముఖ్య సూత్రాల ఆధారంగా సుపరిపాలనపై అధికారులు దృష్టి పెట్టాలి. వర్చువల్, ఫిజికల్ వర్క్ రెండింటినీ సమన్వయంతో నిర్వహించాల్సిన అవసరం ఉంది. నేను, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు అన్ని అంశాలపై సమగ్రంగా పర్యవేక్షణ చేస్తున్నాము' అని సీఎం చంద్రబాబు అన్నారు.

'బుధవారం, గురువారం అన్ని విభాగాలకు సంబంధించిన అంశాలపై విస్తృతంగా చర్చ జరుగుతుంది. జిల్లా స్థాయిలో అధికారులు క్షేత్ర స్థాయిలో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ ప్రభుత్వ పథకాల అమలును పర్యవేక్షించాలి. నేను సుదీర్ఘ ఉపన్యాసాలు ఇవ్వను, ముఖ్య విషయాలపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వడమే నా లక్ష్యం. సూపర్ సిక్స్ పథకాలతో పాటు ఇతర సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నాము. ఈ నెల 13వ తేదీన అన్నదాత సుఖీభవ పథకం నిధులు రైతుల ఖాతాల్లో జమ అవుతాయి. అలాగే ఉగాది పండుగ సందర్భంగా 2 లక్షల 50 వేల ఇళ్లకు గృహ ప్రవేశాలు నిర్వహిస్తాం. అన్నదాత సుఖీభవ, గృహ ప్రవేశాలు ఉగాది కానుకలుగా ప్రజలకు అందిస్తాం' అని సీఎం చంద్రబాబు చెప్పారు.

అదే విధంగా విద్యుత్ రంగంలో ట్రూ డౌన్ చార్జీలను విధించి విద్యుత్ చార్జీలను తగ్గించగలిగామని సీఎం చంద్రబాబు చెప్పారు. ఈ నిర్ణయం ద్వారా వినియోగదారులకు ప్రత్యక్ష లాభం కలిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. రాష్ట్రంలో సమర్థవంతమైన పరిపాలన కోసం అధికారులు సమన్వయంతో పనిచేయాలని సీఎం చంద్రబాబు కలెక్టర్లకు సూచించారు.

## ఇరాన్ కొత్త అధినేతకు ఉత్తర కొరియా మద్దతు

మొదటి పేజీ తరువాయి

ఒకవేళ అమెరికా దూకుడు పెంచితే ఊహించని రీతిలో భయంకరమైన పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. తాము అణ్వాయుధ దేశమనే నిజాన్ని వాషింగ్టన్ అంగీకరిస్తేనే చర్చలకు తావుంటుందని కిమ్ తెగేసి చెప్పారు.

ఇదిలా ఉండగా.. ఉత్తర కొరియా తాజాగా తన సైనిక శక్తిని ప్రదర్శించింది. 'చో హ్యోన్' అనే భారీ యుద్ధ నౌక నుంచి వ్యూహాత్మక క్రూయిజ్ క్షిపణులను ఉత్తర కొరియా పరీక్షించింది. ఈ ప్రయోగాన్ని కిమ్ జోంగ్ ఉన్ స్వయంగా తన కుమార్తె జు ఏతో కలిసి పర్యవేక్షించారు. నౌకాదళాన్ని అణ్వాయుధాలతో సన్నద్ధం చేసే ప్రక్రియలో ఇది కీలక అడుగు అని ఉత్తర కొరియా ప్రకటించింది.

## భూమిపైకి దూసుకొస్తున్న నాసా ఉపగ్రహం

### 14 ఏళ్ల ప్రయాణం తర్వాత ముగిసిన 'వాన్ అలెన్' ప్రస్థానం



న్యూస్ డెస్క్, 11 మార్చి (ఇది కద నిజం): అంతరిక్ష పరిశోధనల్లో కీలక పాత్ర పోషించిన అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ (నాసా)కు చెందిన 'వాన్ అలెన్ ప్రోబ్-ఏ' ఉపగ్రహం నేడు భూ వాతావరణంలోకి ప్రవేశించనుంది. సుమారు 600 నుంచి 700 కిలోల బరువున్న ఈ ఉపగ్రహం, భారత కాలమానం ప్రకారం బుధవారం రాత్రి లేదా గురువారం తెల్లవారుజామున (అమెరికా కాలమానం ప్రకారం మార్చి 10, రాత్రి 7:45 గంటలకు) భూమిపైకి దూసుకు రావచ్చని అమెరికా స్పేస్ ఫోర్స్ అంచనా వేస్తోంది.

ముగిసిన సుదీర్ఘ ప్రయాణం..

భూమి చుట్టూ ఉండే రేడియేషన్ బెల్టులపై (వాన్ అలెన్ బెల్టులు) అధ్యయనం చేయడం కోసం 2012, ఆగస్టు 30న నాసా రెండు జంట ఉపగ్రహాలను (ప్రోబ్ ఏ, ప్రోబ్ బీ) ప్రయోగించింది. కేవలం రెండేళ్ల కాలపరిమితితో వెళ్లిన ఈ ఉపగ్రహాలు, అంచనాలకు మించి ఏడేళ్ల పాటు (2019 వరకు) అద్భుతమైన డేటాను అందించాయి. 2019లో వీటి పనితీరు నిలిచిపోయింది. శాస్త్రవేత్తల ప్రాథమిక అంచనాల ప్రకారం ఈ ఉపగ్రహం 2034 వరకు కక్ష్యలో ఉండాల్సింది. కానీ, ప్రస్తుతం సూర్యుడు తన గరిష్ట సౌర కార్యాచరణ దశలో ఉండటంతో అంతరిక్ష వాతావరణంలో మార్పులు సంభవించాయి. దీనివల్ల వాతావరణ ఘర్షణ పెరిగి, ఉపగ్రహం అంచనా వేసిన దానికంటే ఎనిమిదేళ్ల ముందే భూమి వైపునకు పడిపోతోంది. దీంతో 14 ఏళ్ల ప్రయాణం తర్వాత 'వాన్ అలెన్' ప్రస్థానం ముగిసినట్లైంది.

ప్రమాదం పొంచి ఉందా?

భూ వాతావరణం లోకి ప్రవేశించే క్రమంలో ఏర్పడే తీవ్రమైన వేడి, ఘర్షణ కారణంగా ఉపగ్రహంలోని మెజారిటీ భాగం కాలి బూడిదవుతుందని నాసా వెల్లడించింది. అయితే, కొన్ని గట్టి భాగాలు మాత్రం భూమిని తాకే అవకాశం ఉన్నప్పటికీ, దీనివల్ల ప్రమాదం తక్కువగానే ఉంటుందని అధికారులు ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఈ ఉపగ్రహ గమనాన్ని నాసా, స్పేస్ ఫోర్స్ నిరంతరం పర్యవేక్షిస్తున్నాయి. ఇదే ప్రయోగంలో భాగంగా పంపిన రెండో ఉపగ్రహం (ప్రోబ్-బీ) ఇప్పటికీ కక్ష్యలోనే ఉందని, అది ఈ దశాబ్దం చివరలో భూమి వైపు వచ్చే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు తెలిపారు.

## కాంగ్రెస్‌ను బంగాళాఖాతంలో విసిరేస్తే తప్ప.. తెలంగాణను రక్షించలేం: బండి సంజయ్

న్యూస్ డెస్క్, 11 మార్చి (ఇది కద నిజం): కడియం శ్రీహరి, దానం నాగేందర్ లపై అనర్హత పిటిషన్‌ను స్పీకర్ గడ్డం ప్రసాద్ డిస్మిస్ చేయడం దారుణమని కేంద్రమంత్రి, బీజేపీ నేత బండి సంజయ్ అన్నారు. కాంగ్రెస్ పాలనలో శాసన వ్యవస్థ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని విమర్శించారు.

కన్నతల్లే బిడ్డను చంపడం ఎంత పాపమో.. శాసన వ్యవస్థ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడం అంత కంటే పాపమని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. శాసన వ్యవస్థే ఫిరాయింపులను ప్రోత్సహించేలా స్పీకర్ తీర్పు ఇచ్చారని మండిపడ్డారు. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి, కాంగ్రెస్ టికెట్‌పై ఎంపీగా పోటీ చేసినప్పటికీ అనర్హత వేటు వర్తించకపోవడం సిగ్గుచేటు అని విమర్శించారు. కాంగ్రెస్ కండువా కప్పుకుని ప్రచారం చేసినా పార్టీ ఫిరాయించలేదని చెప్పడం హాస్యాస్పదమని అన్నారు.

గాంధీభవన్‌లో సంసారం చేస్తూ.. కాంగ్రెస్ తరపున ప్రచారం చేస్తున్నా ఫిరాయింపులు వర్తించకపోవడం ప్రజాస్వామ్యానికే చేటు అని బండి సంజయ్ విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా కాంగ్రెస్ కండువాలు కప్పి ఆహ్వానించింది నిజం కాదా అని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి దీనిపై వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు.

శాసన వ్యవస్థపై ప్రజలకు పూర్తిగా నమ్మకం కోల్పోయేలా స్పీకర్ తీర్పు ఇచ్చారని బండి సంజయ్ అన్నారు. రాజ్యాంగ వ్యవస్థలను కాంగ్రెస్ ఆఫీసులో బంధించాలని చూస్తున్నారని ఆరోపించారు. శాసనసభ స్పీకర్... స్వతంత్ర్యంగా వ్యవహరించాలే తప్ప డూప్లికేట్ గాంధీ కుటుంబానికి తాబేదారులా వ్యవహరించకూడదని సూచించారు. ప్రజాస్వామ్యవాదులారా నోరు విప్పండి అని పిలుపునిచ్చారు. పూర్తిగా గాడి తప్పిన శాసన వ్యవస్థను దారిలో పెట్టాల్సిన బాధ్యత ప్రజలదే అని ఆయన స్పష్టం చేశారు.

కాంగ్రెస్‌ను బంగాళాఖాతంలో విసిరేస్తే తప్ప తెలంగాణలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించలేమని బండి సంజయ్ స్పష్టం చేశారు. స్పీకర్ తీర్పుపై హైకోర్టుకు వెళ్తామని తెలిపారు. న్యాయ వ్యవస్థపై తమకు సంపూర్ణ నమ్మకం ఉందని తెలిపారు. బెంగాల్‌లో అనర్హత పిటిషన్ పై స్పీకర్ ఇదే తరహా తీర్పు ఇస్తే హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలతో కొట్టేసిందని గుర్తుచేశారు. తెలంగాణలోనూ ఫిరాయింపులపై చెంప చెళ్లుమనేలా న్యాయ వ్యవస్థ తీర్పు ఇస్తుందనే నమ్మకం ఉందని వ్యాఖ్యానించారు.

## మొజ్తాబా ఖమేనీ క్షేమంగా ఉన్నారు: యూసెఫ్ పెజెస్కియాన్




న్యూస్ డెస్క్, 11 మార్చి (ఇది కద నిజం): ఇరాన్ కొత్త సుప్రీం నేతగా మొజ్తాబా ఖమేనీ ఎన్నికైన విషయం తెలిసిందే. అయితే ఫిబ్రవరి 28వ తేదీన జరిగిన దాడిలో మొజ్తాబా తండ్రి అయతుల్లా అలీ ఖమేనీ మృతిచెందారు. ఆ దాడిలోనే మొజ్తాబాకు గాయాలైనట్లు కొన్ని నివేదికలు వచ్చాయి. ఈనేపథ్యంలో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెస్కియాన్ కుమారుడు స్పందించారు. మొజ్తాబా ఖమేనీ సురక్షితంగా, బలంగా ఉన్నట్లు పేర్కొన్నారు. మొజ్తాబా గాయపడినట్లు వార్తలు వచ్చాయని, అయితే అతనితో లింకున్న కొందరు మిత్రులను ఈ విషయాన్ని అడిగి తెలుసుకున్నానని, మొజ్తాబా క్షేమంగా ఉన్నట్లు వారు చెప్పారని అధ్యక్షుడి కుమారుడు యూసెఫ్ పెజెస్కియాన్ తెలిపారు.

ప్రభుత్వ సలహాదారుడిగా ఉన్న యూసుఫ్ పెజెస్కియాన్ ఈ విషయాన్ని టెలిగ్రాం ఛానల్ ద్వారా వెల్లడించారు. ఖమేనీ మృతిచెందిన రోజే ఆ దాడుల్లో మొజ్తాబా కాళ్లకు గాయాలు అయినట్లు అమెరికాకుచెందిన న్యూయార్క్ టైమ్స్ తన కథనంలో పేర్కొన్నది. అయితే 56 ఏళ్ల మొజ్తాబా ఆదివారం కీలక ప్రకటన చేశారు. అలీ ఖమేనీకి వారసుడిని అని ప్రకటించారు. కాళ్లకు గాయాలు కావడం వల్లే మొజ్తాబా వీడియో సందేశాలు ఇవ్వడం లేదని అమెరికా పత్రిక తన కథనంలో పేర్కొన్నది.

## మే వరకు అత్యధిక ఉష్ణోగ్రతలు.. ఎల్ నినోపై ఐఎండీ వార్నింగ్

న్యూస్ డెస్క్, 11 మార్చి (ఇది కద నిజం): దేశ వ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి. ఈ ఏడాది మార్చి ప్రారంభం నుంచే సూర్యుడు సుర్రుమంటున్నాడు. ఉదయం నుంచే హడలెత్తిస్తున్నాడు. దీంతో బయటకు రావాలంటేనే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

ఈ నేపథ్యంలో కేంద్ర వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. మార్చి నుంచి మే నెల వరకు దేశమంతటా వేడిగాలులు ఉంటాయని.. ఉష్ణోగ్రతలు 50 డిగ్రీలకు పైగా ఉంటుందని.. 2024 సంవత్సరం కంటే ఈ ఏడాది ఎక్కువ ఉష్ణోగ్రతలు ఉంటాయని హెచ్చరికలు జారీ చేసింది.


ప్రస్తుతం మార్చి మొదటి వారంలోనే అనేక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సగటు కంటే చాలా ఎక్కువగా పెరిగినట్లుగా తెలిపింది. వేసవి కాలం పెరుగుతున్న కొద్దీ అనేక రాష్ట్రాలు తీవ్రమైన వేడి ఉంటుందని వాతావరణ సంస్థ హెచ్చరించింది.

2026 వేసవి కాలం.. 2024లో కనిపించిన రికార్డు స్థాయి కంటే ఎక్కువగా వేడిగాలులు దాటే అయ్యే అవకాశం ఉందని తెలిపింది. 2024 ఏప్రిల్-జూన్ మధ్య కాలంలో భారతదేశం 2010 తర్వాత అత్యధిక వేడిగాలులను చూసింది. అనేక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు వారాల పాటు 50 డిగ్రీలు నమోదైంది. మే 29న ఢిల్లీలోని ముంగేష్‌పూర్ ప్రాంతంలో 52.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. 2026 మధ్య నాటికి లా నినా నుంచి ఎల్ నినో పరిస్థితులకు మార్పు వచ్చే అవకాశం ఉందని అంచనా వేసింది. చారిత్రాత్మకంగా భారతదేశంలో ఎల్ నినో సంఘటనలు తీవ్రమైన వేడిగాలులు, రుతుపవనాల అసమానతలతో ముడిపడి ఉంటుంది. ఈ ఏడాది వాతావరణంలో మార్పులు తప్పవని హెచ్చరించింది.

## నక్షా లేని 373 గ్రామాల్లో రీ-సర్వేకు సిద్ధం

మొదటి పేజీ తరువాయి


అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని దాంతో పాటుగా నాణ్యమైన బోధనా పద్ధతులతో చిన్నారులకు విద్యను అందించాలన్నారు. పట్టణాల్లో రహదారులపైన కొంతమంది చంటి బిడ్డలను పెట్టుకొని యాచక వృత్తి కొనసాగిస్తున్నారని ఈ సందర్భంగా భట్టి విక్రమార్క గుర్తు చేశారు. అటువంటి చిన్నారులను శిశు విహార్‌కు పంపి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. శిశు విహార్‌లో ఆధునిక కిచెన్లు నిర్మించాలన్నారు.




దీంతో పాటుగా.. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో ఉపాధి కల్పించే కోర్సులను నిర్వహించాలని ఉపాధి శిక్షణ శాఖను డిప్యూటీ సీఎం భట్టి ఆదేశించారు. కోర్సుల విషయంలో గ్లోబల్ సమ్మిట్‌లో ఎంవోయూలు కుదుర్చుకున్న కంపెనీలను సంప్రదించాలన్నారు. క్యూర్, ప్యూర్, రేర్ పాలసీకి అనుగుణంగా రాష్ట్రానికి రానున్న పరిశ్రమలనూ దృష్టిలో పెట్టుకుని కొత్త కోర్సులు ప్రవేశపెట్టాలన్నారు. ఈ సెంటర్లను స్కిల్స్ యూనివర్సిటీతో అనుసంధానం చేసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ భేటీలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, గడ్డం వివేక్, జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు.

# సమాధుల ప్రాంగణాల్లో మౌలిక వసతులు కల్పించాలి

### : డిప్యూటీ కమిషనర్‌కు నల్ల జై శంకర్ గౌడ్ వినతి



ఇది కద నిజం :కుత్బుల్లాపూర్ 286 డివిజన్ పరిధిలోని సమాధుల ప్రాంగణాల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ సామాజిక కార్యకర్త నల్ల జై శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం జీడిమెట్ల సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జై శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. డివిజన్‌లోని సమాధుల ప్రాంగణాలు ప్రస్తుతం తీవ్ర నిర్లక్ష్యానికి గురై, కనీస సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా అక్కడ ఉన్న వాష్‌రూమ్‌లు పూర్తిగా శిథిలావస్థకు చేరాయని, గతంలో ఉన్న బోర్‌వెల్ పనిచేయకపోవడంతో తాగునీటి సౌకర్యం కూడా కరువైందని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అంత్యక్రియల నిమిత్తం వచ్చే ప్రజలకు ఇబ్బంది కలగకుండా, సమాధుల వద్ద పరిశుభ్రతను పాటించాలని, తక్షణమే బోర్‌వెల్‌కు మరమ్మతులు చేయించి వాష్‌రూమ్‌లను పునరుద్ధరించాలని ఆయన కోరారు. తెలంగాణ ప్రభుత్వ 100 రోజుల ప్రణాళికలో భాగంగా ఈ పనులకు వెంటనే టెండర్లు పిలిచి, మొక్కలు నాటడం వంటి అభివృద్ధి పనులను చేపట్టాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు పులి బాలరాం, ప్రముఖ న్యాయవాది కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఒరిజినల్ సర్టిఫికేట్లు ఇవ్వని ఇంజనీరింగ్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

### ఒకే వాయిదాలో ఫీజు చెల్లించే విధానం తొలగించాలి

### హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ కు ఫిర్యాదు చేసిన జై స్వరాజ్ పార్టీ



ఇది కద నిజం :తెలంగాణ రాష్ట్రంలో చాలా ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాలు తమకు ఫీజు రీయింబర్స్మెంట్ రాలేదని, చదువులు పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఒరిజినల్ సర్టిఫికేట్లు ఇవ్వడం లేదని, దీంతో విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, ఆ కళాశాలలపై తీవ్ర చర్యలు తీసుకోవాలని జై స్వరాజ్ పార్టీ అధినేత కాసాని శ్రీనివాసరావు గౌడ డిమాండ్ చేశారు. ఆయా కళాశాలలపై హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ ఛైర్మన్ వి. బాలకృష్ణ రెడ్డికి కేఎస్ఆర్ గౌడ బుధవారం ఫిర్యాదు చేశారు. విదేశాల్లో చదువులకు వెళ్లిన విద్యార్థులు లేదా ఉద్యోగాలు చేస్తున్న వారికి ఇంజనీరింగ్ కళాశాలల దుర్మార్గం వల్ల ఇబ్బందులు పడుతున్నారని, పలువురు తల్లిదండ్రులు ఈ అంశంపై తమ పార్టీకి తెలిపిన విషయాన్ని ఛైర్మన్ దృష్టికి తీసుకు వచ్చామని తెలిపారు. విద్యార్థులను వేధిస్తున్న కళాశాలల్లో విజ్ఞాన భారతి ఇంజనీరింగ్ కళాశాల ఒకటని, ఆధారాలతో ఛైర్మన్ కేఎస్ఆర్ గౌడ ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ విధానం ప్రకారం విద్యార్థుల చదువులు ముగిసిన వెంటనే వారి ఉత్తీర్ణత ఒరిజినల్ సర్టిఫికేట్లు ఇవ్వాలని, కళాశాలలు ఇవ్వకపోవడంతో విద్యార్థులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని ఆయన అన్నారు. ఫీజు రీయింబర్స్మెంట్ తల్లిదండ్రులు చెల్లించాలని కళాశాలల యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయని, పేదలైన తల్లిదండ్రులు ఫీజు రీయింబర్స్మెంట్ చేయలేక అటు ప్రభుత్వం చెల్లించక విద్యార్థులు అఘాయిత్యాలకు పాల్పడే అవకాశం ఉందని కేఎస్ఆర్ గౌడ బాలకృష్ణ రెడ్డికి వివరించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యత తీసుకున్న నాటి నుండి ఫీజు రీయింబర్స్మెంట్ పూర్తిగా కళాశాలలకు ఇవ్వలేదని, ఇది ఆయా వర్గాల విద్యార్థులకు చాలా ఇబ్బందిగా మారిందని ఆయన అన్నారు. అదే విధంగా చాలా ఇంజనీరింగ్ కళాశాలలు నిర్దేశించిన ఫీజును ఒకే వాయిదాలో చెల్లించాలని, ఆన్లైన్ విధానం రూపొందించిన కారణంగా చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారని, తల్లిదండ్రుల వెసులుబాటును బట్టి వివిధ వాయిదాల్లో విద్యా సంవత్సరం పూర్తి అయ్యే లోగా చెల్లించే అవకాశం ఇవ్వాలని, ఈ మేరకు ఇంజనీరింగ్ కళాశాలలకు ఆదేశాలు జారీ చేయాలని కాసాని శ్రీనివాసరావు గౌడ పేర్కొన్నారు. తమ శక్తి మేరకు ఇంజనీరింగ్ కళాశాలలను కట్టడి చేస్తున్నామని, చాలా కళాశాలలు ప్రభుత్వ ఆదేశాలు పాటించడం లేదని తమ దృష్టికి వచ్చిందని ఆయన చెప్పారని కేఎస్ఆర్ గౌడ అన్నారు.

# ఆశ కార్యకర్తల సమస్యల పై చర్యలు



ఇది కద నిజం ,సికింద్రాబాద్ : ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం పై వత్తిడి తెస్తామని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. తుకారం గేటు అర్బన్ హెల్త్ సెంటర్ కు చెందిన ఆశా వర్కర్ లు బుధవారం సితఫలమండీ లోని ఎం.ఎల్.ఏ. క్యాంపు కార్యాలయంలో పద్మారావు గౌడ్ తో సమావేశమై వివిధ సమస్యల పై వినతి పత్రాన్ని అందించారు. వేతనాలు పెంచాలని, పని వత్తిడి తగ్గించాలని, వివిధ టార్గెట్ లను నివారించాలని విజ్ఞప్తి చేశారు. వారి సమస్యలని వెంటనే ప్రభుత్వ దృష్టికి తెచ్చి పరిష్కరిస్తామని పద్మారావు గౌడ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# పేదలకు వైద్య సేవలకు ప్రాముఖ్యత

### - శాసనసభ్యులు తీగుల్ల పద్మారావు గౌడ్



ఇది కద నిజం ,సికింద్రాబాద్ : పేద రోగులను ఆదుకొనేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధిని తాము సద్వినియోగం చేసుకుంటామని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన గర్ దాసు లక్ష్మి (మెట్టుగూడ), వెంపటి శారద (మైలా రాగడ్డ) మన్సూర్ అక్రం మహమ్మద్ (నార్త్ లాలాగూడ), రోకటి ఉమా చంద్రశేఖర్ (నామాలగుండు) లు అస్వస్థతకు గురై, సితఫలమండీ లోని ఎం.ఎల్.ఏ. క్యాంపు కార్యాలయాన్ని సహాయానికై ఆశ్రయించారు. వెంటనే స్పందించిన శాసనసభ్యులు పద్మారావు గౌడ్ వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి నిమ్స్ ఆసుపత్రిలో వైద్య సేవలను పొందేందుకు వీలుగా ఎల్.ఓ.సి. పత్రాలను తన కార్యాలయంలో అందించారు. మన్సూర్ అహ్మద్ కు రూ. రెండు లక్షలు, రోకటి ఉమచంద్ర శేఖర్ కు రూ. రెండు లక్షలు, వెంపటి శారదకు రూ.1.10 లక్షలు, లక్ష్మికి రూ.3.50 లక్షల మేరకు మొత్తం రూ. 8.60 లక్షల విలువజేసే ఎల్.ఓ.సీ. పాత్రలను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలకు వైద్య సేవలను అందించడంలో తాము అగ్ర స్థానంలో నిలుస్తామని అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన ప్రజల సమస్యల పరిష్కారానికి సితాఫలమండిలోని తమ క్యాంపు కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు, అధికారులు పాల్గొన్నారు.

# సెంట్ ఆన్స్ మహిళా కళాశాలలో యూత్ పార్లమెంట్

### విద్యార్థినుల ప్రతిభను ప్రశంసించిన కేటీఆర్




ఇది కద నిజం :హైదరాబాద్ మెహదీపట్నంలోని ప్రముఖ విద్యాసంస్థ St. Ann's College for Women, మెహదీపట్నంలో నిర్వహించిన యూత్ పార్లమెంట్ కార్యక్రమానికి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్య, నాయకత్వం, సామాజిక అవగాహనకు ప్రాధాన్యతనిస్తూ అనేక ప్రతిభావంతమైన మహిళా నాయకులను తీర్చిదిద్దుతున్న ఈ కళాశాల నగరంలో ప్రముఖ మహిళా విద్యాసంస్థగా గుర్తింపు పొందింది. ఈ సందర్భంగా విద్యార్థినులు నిర్వహించిన పార్లమెంట్ సెషన్‌ను కేటీఆర్ ఆసక్తిగా వీక్షించి వారి ప్రతిభను అభినందించారు. మహిళా శక్తి ఎంతో గొప్పదని పేర్కొంటూ యువతులు భవిష్యత్తులో మంచి నాయకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా మహిళలు ఎక్కువగా ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా మారి సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.

ఇలాంటి అవగాహనాత్మక కార్యక్రమాన్ని నిర్వహించిన కళాశాల యాజమాన్యాన్ని కూడా కేటీఆర్ అభినందించారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని ఆయన పేర్కొన్నారు.

# సీతారామచంద్ర తిరుకల్యాణ మహోత్సవ కరపత్రం ఆవిష్కరణ



ఇది కద నిజం :లలితాబాగ్ మల్లికార్జున నగర్‌లోని విఘ్నేశ్వర సాయిధామం ఆలయంలో ఈనెల 27న నిర్వహించనున్న సీతారామచంద్ర తిరుకల్యాణ మహోత్సవ కరపత్రాన్ని మంగళవారం ఆలయ కమిటీ ప్రతినిధులు ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఈనెల 25వ తేదీ నుండి మూడు రోజుల పాటు ఈ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మిద్దెల చంద్రశేఖర్ రెడ్డి, వైస్ చైర్మన్ మునిగంటి సుశీల్ కుమార్, అధ్యక్షుడు బొడ్డు వెంకటేశ్, కోశాధికారి గుండు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి పగిళ్ళ నరేందర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కాసా దయానంద్, యువజన కమిటీ సలహాదారు వీరబోయిన శివకుమార్ తదితరులు పాల్గొని కార్యక్రమ విజయవంతానికి పిలుపునిచ్చారు.

# కంచనపల్లిలో ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం




రఘునాథపల్లి, 11 మార్చి (ఇది కద నిజం): రఘునాథపల్లి మండలంలోని కంచనపల్లి పశువైద్యశాలలో పశువ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను అందజేశారు. ఈ కార్యక్రమాన్ని పశువైద్యుడు డా. శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డా. శ్రీనివాస్ మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి ఒక అంటువ్యాధి అని తెలిపారు. ఇది పికార్నో అనే వైరస్ వల్ల సోకుతుందని చెప్పారు. మన రాష్ట్రంలో ఎక్కువగా ఓ, ఏ, ఏఎస్ఐఏ-1 స్ట్రెయిన్స్ వలన ఈ వ్యాధి సంభవిస్తుందని పేర్కొన్నారు. ఈ వ్యాధి వల్ల మరణాల శాతం తక్కువగా ఉన్నప్పటికీ, పశువుల ఉత్పాదక శక్తి మరియు పునరుత్పత్తి సామర్థ్యం తగ్గిపోతుందని వివరించారు. దేశీ జాతి పశువులతో పోలిస్తే సంకరజాతి పశువుల్లో ఈ వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా మార్చి, ఏప్రిల్, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో ఈ వ్యాధి ఎక్కువగా కనిపిస్తుందని చెప్పారు. ఈ వ్యాధి సోకితే పాడి రైతులకు ఆర్థికంగా భారీ నష్టం వాటిల్లే అవకాశముందని పేర్కొన్నారు. అందువల్ల ప్రతి రైతు తమ పశువులకు కచ్చితంగా టీకాలు వేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గోంగొల్ల అబ్రహాం మాట్లాడుతూ రైతులు తమ పశువులను వ్యాధుల నుంచి రక్షించుకునేందుకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత టీకాల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సంపత్ పాల్గొన్నారు. అలాగే గ్రామానికి చెందిన రైతులు పెద్ద సంఖ్యలో హాజరై తమ పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించుకున్నారు.

# బుర్ర వెంకటేశంకు వినతి పత్రం అందజేసిన ఎమ్మెల్సీ అంజిరెడ్డి



పటాన్ చెరు, 11 మార్చి (ఇది కద నిజం): రాష్ట్రంలో ఖాళీగా ఉన్న అన్ని ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి తక్షణమే నోటిఫికేషన్లు విడుదల చేయాలని ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం టీజీపీఎస్సీ కార్యాలయంలో చైర్మన్ బుర్ర వెంకటేష్ ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గత ఎన్నికల ముందు ఇప్పుడు ఉన్న సీఎం రేవంత్ రెడ్డి బిస్వాల్ కమిటీ అని తరచూ ప్రస్తావించేవాడని , వచ్చిన తర్వాత సీఎంకు బిస్వాల్ కమిటీ గుర్తుకు రావడం లేదన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను దగా చేసిందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచిన ఇప్పటికీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందన్నారు. రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక విధానాలను కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియామకం చేపట్టిన ఉద్యోగులపై శ్వేత పత్రాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్టంలో గ్రూప్ 1,2,3,4 ఉద్యోగ ప్రకటనలతో పాటు సీడీపీవో, విద్యుత్ శాఖలో ఏఈ, ఏ ఈఈ, వ్యవసాయ శాఖలో ఏవో, ఏఈవో, రవాణా శాఖలో ఏ ఎమ్ వి ఐ, ఫారెస్ట్ డిపార్ట్మెంట్ లో ఎఫ్ బి ఓ, ఎఫ్ ఎస్ ఓ, ఎఫ్ ఆర్ వో , లతో పాటు ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే జూనియర్ లెక్చరర్, పోస్టులను వెంటనే భర్తీ చేసి ఉన్నత విద్యను మరింత బలోపేతం చేయాలని ఆయనను కోరారు. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి రెండేళ్లు గడుస్తున్నా ఆ విషయాన్ని పట్టించుకోవడం లేదన్నారు. నిరుద్యోగుల పక్షాన తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. వచ్చే బడ్జెట్ సెషన్ లో నిరుద్యోగుల సమస్యలను మండలిలో ప్రస్తావిస్తామన్నారు. దీనికి టీజీపీఎస్సీ చైర్మన్ సానుకూలంగా స్పందించినట్లు అంజిరెడ్డి తెలిపారు.

# లక్డారం వెంకటేశ్వర స్వామి టెంపుల్ ను దర్శించుకున్న సత్యం శ్రీరంగం



కూకట్ పల్లి, 11 మార్చి (ఇది కద నిజం): లక్డారం గ్రామంలోని అతి పురాతనమైన 500 సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించి వెంకటేశ్వర స్వామి వారికీ ప్రత్యేక పూజలు నిర్వహించారు పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం ఇందుమతి దంపతులు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు సత్యం శ్రీరంగం దంపతులను శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గోపాల్ రెడ్డి, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజి రెడ్డి, మల్లేష్, గ్రామా పెద్దలు, ఆలయకమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సినిమా న్యూస్



## ‘ది పారడైజ్’లో నాని పాత్రపై క్లారిటీ ఇచ్చిన కాసర్ల శ్యామ్

నాని హీరోగా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ‘ది ప్యారడైజ్ ’ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. నాని కెరీర్‌లోనే మొదటిసారి పూర్తిస్థాయి రా అండ్ రస్టిక్ పాత్రలో కనిపించబోతున్నారని చిత్రబృందం తెలిపింది.

ఇటీవల విడుదలైన ‘ఆయా షేర్’ పాట ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఈ పాట రచయిత కాసర్ల శ్యామ్ మీడియాతో మాట్లాడుతూ సినిమాలో నాని ‘సవారి’ అనే తెగకు చెందిన వ్యక్తిగా కనిపిస్తారని వెల్లడించారు. ఈ పాట రాయడం తనకు అదృష్టమని, గతంలో వచ్చిన ‘దసరా’లాగే ఈ సినిమా కూడా మంచి గుర్తింపు తెస్తుందని తెలిపారు.

## రూ.150 టికెట్‌తోనే రూ.50 కోట్లు.. ఇదే అసలైన విజయం!



తమిళ నటుడు శివకార్తికేయన్ నిర్మించిన ‘తాయ్ కిళవి’ సక్సెస్ మీట్‌లో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పెళ్లి అయినప్పటి నుంచి ఆర్థిక వ్యవహారాలన్నింటినీ తన భార్య ఆర్తి శివకార్తికేయన్ చూసుకుంటున్నారని, తన బ్యాంక్ ఖాతాలో ఎంత డబ్బు ఉందో కూడా తనకు తెలియదని తెలిపారు.

ఈ చిత్రం మహిళలకు అంకితమని పేర్కొన్న ఆయన, కథను పలుమార్లు విని, షూటింగ్ తర్వాత సన్నివేశాలను పరిశీలిస్తూ మొత్తం 12 సార్లు సినిమా చూశానని చెప్పారు. మంచి ప్లానింగ్ ఉంటే నిర్మాతకు ఖర్చు తగ్గుతుందని ఆయన అన్నారు.

చిత్రంలో కీలక పాత్ర పోషించిన రాధికా శరత్ కుమార్ మాట్లాడుతూ.. “కొన్ని సినిమాల టికెట్లు రూ.1500--2000కు అమ్ముతుంటారు. కానీ రూ.150 టికెట్ ధరలతోనే ఈ సినిమా రూ.50 కోట్లకుపైగా వసూలు చేసింది. ఇదే అసలైన విజయం” అని తెలిపారు. ఈ కామెడీ డ్రామా చిత్రం ఫిబ్రవరి 27న విడుదలైంది.

## మార్చి 26న ‘గోట్’ విడుదల



ప్రముఖ హాస్య నటుడు సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న “G.O.A.T (Greatest Of All Times)” చిత్రం మార్చి 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ చిత్రంలో దివ్య భారతి కథానాయికగా నటిస్తున్నారు. చిత్రానికి వేదవ్యాస్ దర్శకత్వం వహించగా, చంద్రశేఖర్ రెడ్డి మొగుళ్ళ నిర్మిస్తున్నారు.

ఇప్పటికే షూటింగ్ పూర్తయిన ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. ఖర్చు విషయంలో ఎక్కడా రాజీపడకుండా రిచ్‌గా చిత్రాన్ని రూపొందించామని, సుడిగాలి సుధీర్ కెరీర్‌లో ఇది మైలురాయిగా నిలుస్తుందని నిర్మాత తెలిపారు. పూర్తి కమర్షియల్ అంశాలతో పాటు యువతను ఆలోచింపజేసే అంశాలు కూడా సినిమాలో ఉంటాయని చెప్పారు.ఈ చిత్రంలో సర్వదమన్ డి . బెనర్జీ , బ్రహ్మాజీ , ఆడుకలం నరేన్ , రాజేంద్రన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. సంగీతం లియోన్ జేమ్స్ అందించగా, నేపథ్య సంగీతం మణి శర్మ సమకూర్చారు. త్వరలోనే ట్రైలర్ విడుదల చేయనున్నట్లు చిత్రబృందం తెలిపింది.

## సుకుమార్ శిష్యుడితో మెగాస్టార్ సినిమా!



మెగాస్టార్ చిరంజీవి తన తదుపరి చిత్రాల విషయంలో యువ దర్శకులకు అవకాశం ఇస్తున్నారు. ముఖ్యంగా సుకుమార్ శిష్యులతో వరుసగా సినిమాలు చేయడానికి ఆసక్తి చూపుతున్నట్లు టాలీవుడ్‌లో చర్చ సాగుతోంది.

ఇప్పటికే ‘దసరా ’ ఫేమ్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో ఒక ప్రాజెక్ట్ ఖరారైన విషయం తెలిసిందే. తాజాగా మరో సుకుమార్ శిష్యుడు అయిన దర్శకుడు శ్రీనివాస్ (శ్రీను ) చెప్పిన గ్రామీణ నేపథ్య కథకు చిరంజీవి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం.

ఈ చిత్రం పూర్తి స్థాయి విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే పవర్‌ఫుల్ కథగా ఉండనుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఈ ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన ఇంకా వెలువడాల్సి ఉంది.



## సినీ నటి హన్సికా విడాకులు



ఒకప్పటి స్టార్ హీరోయిన్ హన్సిక మోత్వానీ తన భర్త సోహైల్ కతూరియా తో విడాకులు తీసుకున్నారు. 2022లో వివాహం చేసుకున్న ఈ జంట నాలుగేళ్ల వివాహ బంధానికి ముగింపు పలికింది.

తెలుగు, తమిళ చిత్రాల్లో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు పొందిన హన్సికా,జూ.ఎన్టీఆర్ ., అల్లు అర్జున్ వంటి ప్రముఖ హీరోలతో నటించారు. తన చిన్ననాటి స్నేహితుడు సోహైల్ కతూరియాతో ప్రేమలో పడి పెళ్లి చేసుకున్న ఆమె, కొంతకాలంగా విడాకుల వార్తలతో చర్చల్లో నిలిచారు. తాజాగా వీరిద్దరికి విడాకులు మంజూరైనట్లు సమాచారం.

## అతీంద్రియ అంశాలతో ‘డార్క్ నైట్’




పూర్ణ ప్రధాన పాత్రలో నటించిన ‘డార్క్ నైట్ ’ ఈ నెల 13న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి జి.ఆర్.ఆదిత్య దర్శకత్వం వహించగా, త్రిగున్ , విదార్థ్ , శుభశ్రీ రాయగురు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రాన్ని సురేష్ రెడ్డి కొవ్వూరి నిర్మించగా, పట్లోళ్ల వెంకట్‌రెడ్డి సమర్పిస్తున్నారు. నాలుగు ప్రధాన పాత్రల జీవితాల్లోని రహస్యాలు, భావోద్వేగాలు, సంఘర్షణల చుట్టూ సాగే కథకు అతీంద్రియ అంశాలు, ఊహించని మలుపులు మరింత ఉత్కంఠను తీసుకువస్తాయని నిర్మాత తెలిపారు. నేటి తరానికి సంబంధించిన అంశాలను ప్రతిబింబించే ఈ చిత్రం ప్రేక్షకులకు విభిన్న అనుభూతిని అందిస్తుందని చెప్పారు.ఈ చిత్రానికి సంగీతం మిస్కిన్ అందించగా, ఛాయాగ్రహణం కార్తీక్ ముత్తు కుమార్ నిర్వహించారు.